క్లుప్తంగా

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీఓస్ కాలనీలో కొలువైన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సుప్రభాత సేవలు వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల నిర్వహించి, సుప్రభాతం పఠించిన అనంతరం స్వామివారికి అభిషేకాలు జరిపారు. ఆలయ అర్చకులు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7:30 గంటలకు బాలభోగం, 9:30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి జరిగాయి. ఉదయం 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11:30 గంటలకు రాజభోగ నివేదన సమర్పించారు. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా 300 మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం 6:30 గంటలకు విశేష హారతి సమర్పణలో భాగంగా నక్షత్ర హారతి, కర్పూర హారతి, కూష్మాండ హారతి, కుంభ హారతి వంటి సేవలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ వేడుకల్లో పాల్గొని వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సహాయ నిధి చెక్కుల పంపిణీ



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

తాటిచెట్లపాలెం: స్థానిక ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కార్యాలయంలో శనివారం ఆయన చేతుల మీదుగా లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. 51, 44 వార్డులకు చెందిన పలువురు లబ్ధిదారులకు సుమారు రూ.7.85 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలకు ఎటువంటి అనారోగ్య సమస్య వచ్చినా.. ఆస్పత్రిలో చూపించుకుని వారి ఒరిజినల్ బిల్లులను తన కార్యాలయంలో అందజేసినట్లయితే ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, కూటమి నాయకులు సురేష్‌బాబు, శ్యామలదీపిక, ఉషాకిరణ్, కోయిలాడ వెంకటేష్, నాగరాజు, మళ్ల లక్ష్మి, రఘు, కీర్తి, శ్రీనివాస్, లోహిత, పరమేశ్వరరావు, శంకర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ పరీక్షలపై అవగాహన సదస్సు నేడు

సీతంపేట: ఏఆర్‌కే రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో సివిల్ సర్వీసెస్ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధి వి.సృజన ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సదస్సు జరుగుతుందని, ఐఏఎస్, ఐపీఎస్ లాంటి ఉన్నత ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యం గల వారు పాల్గొనాలని ఆమె కోరారు. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో విద్యార్థులకు ఉన్న సందేహాలను ఆయా సబ్జెక్టుల నిపుణులు నివృత్తి చేస్తారన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సదస్సులో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 89787 76062 నంబర్‌లో సంప్రదించాలని సంస్థ ప్రతినిధి కోరారు.

డిఫెన్స్ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

విశాఖ సిటీ: నగరంలో అనధికారికంగా డిఫెన్స్ మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ సూపరింటెండెంట్ టాస్క్ ఫోర్స్ అధికారులు అరెస్టు చేశారు. అతడి నుంచి 20 వివిధ బ్రాండ్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం .. మహారాణిపేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చావుల మదుం దగ్గర అక్రమంగా డిఫెన్స్ మద్యం బాటిళ్లు విక్రయిస్తున్నట్లు అధికారులకు సమాచారం అందింది. దీంతో ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్ ఆదేశాలతో ఏఈఎస్ టి.రాజశేఖర్ సమక్షంలో సీఐ రవికిరణ్, ఎస్సై ముసలనాయుడు, సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. కాపు మురళీమోహన్ అనే వ్యక్తి డిఫెన్స్ మద్యం విక్రయించడానికి ప్రయత్నిస్తుండగా పట్టుకున్నారు. నిందితుడు నావెల్ డాక్‌యార్డ్‌లో 15 ఏళ్లుగా కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. అతడికి ఉన్న పరిచయాలతో మద్యం బాటిళ్లను సేకరించి అధిక ధరలకు విక్రయిస్తూ ఉంటున్నట్లు గుర్తించారు. మురళీమోహన్‌పై మహారాణిపేట ఎక్సైజ్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.







దాడి రామ్మూర్తి కల్యాణ మండపంలోని సచివాలయంలో అర్హుల జాబితాలో తమ పేర్లు వెదుకుతున్న విద్యార్థుల తల్లులు, కుటుంబ సభ్యులు

ప్చ్.. నిరాశే..!

- అర్హులందరికీ వర్తించని 'తల్లికి వందనం'
- నిబంధనలు పెట్టి.. తూట్లు పొడిచిన ప్రభుత్వం
- ఆవేదన వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లులు

సీతంపేట: ఎన్నికలకు ముందు **'నీకు 15వేలు, నీకు 15వేలు, ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంత మందికి రూ.15వేలు చొప్పున తల్లికి వందనం ఇస్తాం'** అంటూ చేసిన ప్రకటనలు **ఇప్పుడు తల్లుల్లో తీవ్ర నిరాశను రేకెత్తిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం** అధికారంలోకి వచ్చాక మొదటి **సంవత్సరం ఈ పథకాన్ని అమలు చేయకపోవడంతోనే నిరాశ** మొదలైంది. తాజాగా రెండో **ఏడాది పాఠశాలలు** తిరిగి తెరిచే రోజున 'తల్లికి **వందనం' డబ్బులు** తల్లుల బ్యాంకు ఖాతాల్లో **జమ చేస్తామని ప్రభుత్వం** ప్రకటించడంతో వారం**తా ఆనందపడ్డారు.**

అయితే బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ కాకపోవడంతో తల్లులు షాక్‌కు గురయ్యారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాలుగుసార్లు 'అమ్మ ఒడి' అందుకున్న చాలా మందికి కూటమి ప్రభుత్వంలో 'తల్లికివందనం' పడలేదని ఆవేదన చెందుతున్నారు. ఇంట్లో ఎంత మంది పిల్లలున్నా, కనీసం ఒక్క పిల్లవాడికి కూడా పడలేదని వారంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డబ్బులు పడని తల్లులు ఏటీఎంలకు వెళ్లి బ్యాలెన్స్‌లు చెక్ చేసుకోగా, డబ్బులు జమ కాలేదని తెలిసి సంబంధిత సచివాలయాలకు శుక్రవారం వెళ్లారు. అక్కడ అర్హుల, అనర్హుల జాబితాలను నోటీసు బోర్డులో చూడమని సిబ్బంది చెప్పడంతో, తల్లులు తమ పేర్లు ఉన్నాయో లేదో చూసుకున్నారు. అనర్హుల జాబితాలో పేరు ఉంటే, దానికి గల కారణం పక్కన రాసి ఉందని సచివాలయ సిబ్బంది తెలిపారు. నెలకు రూ.12 వేలకు మించి ఆదాయం, 300 యూనిట్లకు మించి విద్యుత్ వాడకం వంటివి అనర్హతకు కారణాలుగా చూపించారు.

అన్యాయం చేయవద్దు

గత ప్రభుత్వంలో నాలుగేళ్ల వరుసగా అమ్మఒడి అందుకున్నామని, కూలి పనులు, ఇళ్లల్లో పనులు, చిరువ్యాపారాలు చేసుకునే తమలాంటి వారికి ఎక్కువ ఆదాయం, ఎక్కువ కరెంట్ వాడకం వంటి కారణాలతో పిల్లలకు అన్యాయం చేయవద్దని తల్లులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ విషయంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు..

రెండు రోజులు వరుస సెలవులు

'తల్లికి వందనం' పథకం కింద శుక్రవారం మధ్యాహ్నం నుంచి నిధుల విడుదల ప్రారంభం కాగా, తొలిరోజు కొంతమంది తల్లుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయి. అయితే నిధులు అందనివారు శని జమ అవుతుందని ఆశించారు. శనివారం ఉదయం కూడా తమ ఖాతాల్లో డబ్బులు పడకపోవడంతో కారణం తెలుసుకునేందుకు తల్లులు సచివాలయాలకు పరుగులు తీశారు. **అయితే** రెండో శనివారం కావడం**తో బ్యాంకులు సెలవు,** ఆదివారం కూడా సెలవు **దినం కావడంతో ఎక్క**డా సరైన సమాధానం **దొరకలేదు. దీంతో** సోమవారం వరకు వేచి **చూడక తప్పని పరిస్థితి** ఏర్పడటంతో తల్లులు **నిరాశగా వెనుతిరిగారు.**

నిరాశకు గురయ్యా..



మా పాప యామిని 8వ తరగతి చదువుతోంది. తల్లికి వందనం డబ్బులు బ్యాంకు అకౌంట్‌లో పడలేదు. ఎందుకు పడలేదు తెలుసుకుందామని సచివాలయానికి వస్తే శనివారం, ఆదివారాలు సెలవు, సోమవారం సచివాలయం సిబ్బంది వస్తారని చెబుతున్నారు. గోడకు పెట్టిన లిస్టులో కూడా మా పాప పేరు కనిపించలేదు. గతంలో నాలుగేళ్లు అమ్మ ఒడి డబ్బులు పడ్డాయి. ఈ సారి కూడా తల్లికి వందనం డబ్బులు పడతాయని ఎంతో ఆశగా చూశా..నిరాశే మిగిలింది.

– ముద్దాద సిమ్మ, అక్కయ్యపాలెం

ఒక్కరికి కూడా పడలేదు



నాకు ఇద్దరు పిల్లలు. 2, 5 తరగతులు చదువుతున్నారు. ఇద్దరికీ రూ.15వేలు చొప్పున రూ.30 వేలు పడతాయని ఆశపడ్డాను. బ్యాంకు బ్యాలెన్స్ చెక్ చేశా... ఇద్దరికి కాదు కదా కనీసం ఒక్కరికి కూడా డబ్బులు పడలేదు. కారణం తెలుసుకుందామని సచివాలయాని వస్తే రెండు రోజులు సెలవు అని తెలిసింది. గత ప్రభుత్వంలో రెండు సార్లు అమ్మఒడి అందుకున్నాను. ఈసారి తల్లికి వందనం డబ్బులు వేస్తారని అనుకున్నాను.

– కె.సూర్యనారాయణమ్మ, లలితానగర్

డబ్బులు జమకాలేదు



నేను ఇంటర్. తమ్ముడు టెన్త్ చదువుతున్నాం. ఈ సారి ఇద్దరికీ తల్లికి వందనం డబ్బులుపడతాయి.. ఫీజులకు ఉపయోగపడతాయని అమ్మనాన్న ఆశపడ్డారు. కానీ బ్యాంకు అకౌంట్‌లో డబ్బులు పడలేదు. నాన్న అల్యూమినియం వర్కర్, అమ్మ హౌస్‌వైఫ్. గతంలో నాలుగు సార్లు అమ్మఒడి వచ్చింది. ఈసారి కూడా అలాగే డబ్బులు పడతాయనుకున్నాం.

– మేఘన, అఖిల్, సంఘం ఆఫీస్

అధికారులు స్పందించాలి



నాకు ఇద్దరు పిల్లలు. బాబు 9వ తరగతి, పాప 10వ తరగతి చదువుతున్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేలు చొప్పున తల్లికి వందనం వేస్తామని చెప్పారు. తీరా చూస్తే బ్యాంకు అకౌంట్‌లో డబ్బులు పడలేదు. గత ప్రభుత్వంలో నాలుగేళ్లు వరుసగా అమ్మఒడి అందుకున్నాం. ఈ సారి ఇద్దరు పిల్లలు పడతాయని అనుకున్నాను. అధికారులు స్పందించి డబ్బులు పడేలా చూడాలి.

– వద్దాది సుమ, రామకృష్ణానగర్

రైల్వేస్టేషన్‌లో 11 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో శనివారం రైల్వే పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నిందితులను అదుపులోకి తీసుకుని, 11 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ శాంతారాం, ఆర్పీఎఫ్ సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు చేశారు. తమిళనాడు కన్యాకుమారి జిల్లాకు చెందిన అలమీన్, అజిత్ అయ్యప్పన్‌లు విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా తమిళనాడుకు గంజాయిని అక్రమంగా రవాణా చేయడం గుర్తించి వీరిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.55 వేల విలువైన 11 కేజీల గంజాయిని సీజ్ చేశారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



డాక్టర్ పట్టాభి సీతారామయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

సీతంపేట: ఇటీవల జరుగుతున్న సైబర్ నేరాలపై రిటైర్డ్ ఉద్యోగులు అవగాహన పెంపొందించుకోవాలని సభాధ్యక్షుడు డీజీఎస్ జి.వాసుదేవమూర్తి సూచించారు. ఆంధ్రా బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సమావేశం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ మోసాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏజీఎస్ టి.కామేశ్వరరావు, ఈసీ మెంబర్ ఎం.సూర్యభాస్కరరావు, కోశాధికారి జి.ముత్యుంజయరావులు మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగుల హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం, హౌసింగ్ లోన్ ఇన్సూరెన్స్‌పై అవగాహన కల్పించారు. సభ్యుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. ముందుగా ఆంధ్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎం.సూర్యభాస్కరరావు, ఆర్.వి.రవికుమార్, విశ్రాంత జనరల్ మేనేజర్ టి.వి.ఎస్.చంద్రశేఖర్, బ్యాంక్ విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల పరిరక్షణకు గళమెత్తిన మేధావి వర్గం



మేధామథనం సదస్సులో పాల్గొన్న మేధావి వర్గం

సీతంపేట: గ్రంథాలయాలు జ్ఞానం, విజ్ఞానం అందించడమే కాకుండా మానవ పురోగతికి దోహదపడతాయని మాజీ వీసీ ఆచార్య కె.ఎస్.చలం అన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వికాస ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయాల దశ దిశ, ప్రజల కర్తవ్యం' అనే అంశంపై మేధామథనం పేరిట నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. దేశంలో హిందీ తర్వాతి స్థానంలో ఉన్న తెలుగులో పుస్తకాల ప్రచురణ తగ్గుతోందని, పబ్లిషింగ్ సంస్థలు కూడా మూతపడుతున్నాయని చెప్పారు. కేరళలోని గ్రంథాలయాల నిర్వహణ తీరును వివరిస్తూ, మన రాష్ట్రంలో వెనుకబాటుతనాన్ని తెలియజేశారు. గ్రంథాలయాల పరిరక్షణకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, ప్రజలను సమాయత్తం చేయాలన్నారు. ప్రజల నుంచి సెస్ వసూలు చేస్తున్నా.. లైబ్రరీలకు నిధులు విడుదల చేయట్లేదన్నారు. ఉద్యమ వేదిక కన్వీనర్ వల్లూరి శివప్రసాద్ మాట్లాడుతూ గ్రంథాలయాల వెనుకబాటు వల్ల సమాజానికి కలిగే నష్టాన్ని వివరించారు. మాజీ వీసీ రొక్కం సుదర్శన్ మాట్లాడుతూ మానవ అభివృద్ధికి నాంది పలికే గ్రంథాలయాలను ప్రజల ఆస్తిగా భావించాలన్నారు. జీవీఎంసీ నుంచి గ్రంథాలయాలకు రూ.117 కోట్లు బకాయి ఉందని తెలిపారు. మాజీ వీసీ ఆచార్య హెచ్.లజపతిరాయ్ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాల్లో చదువుకునేలా అలవాటు చేయాలన్నారు. దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ ఫౌండర్ వీసీ ఆచార్య వై.సత్యనారాయణ మాట్లాడుతూ గ్రంథాలయాల విషయంలో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా ఉందో చెప్పాలన్నారు. ఆచార్య జి.నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ రీజనల్ లైబ్రరీ దీనావస్థను వివరించారు. యువతను భాగస్వామ్యం చేసి ఉద్యమం నడపాలన్నారు. కార్యక్రమంలో రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, సాహితీవేత్త నల్లి ధర్మారావు, డి.వి.సూర్యారావు, పౌర గ్రంథాలయ సేవా సమితి అధ్యక్షుడు బి.ఎల్.నారాయణ, సాహితీవేత్తలు మస్తాన్‌రెడ్డి, శిరేల సన్యాసిరావు, కె.నరసింహం, ఉప్పల అప్పలరాజు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



చిన్నారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న సిబ్బంది

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఐదేళ్లు పూర్తి చేసుకున్న చిన్నారులకు సర్టిఫికెట్లు, విద్యా సామగ్రి కిట్లు, బహుమతులను సిబ్బంది అందజేశారు. ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ఐసీడీఎస్ అధికారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు సర్టిఫికెట్లు ఇచ్చి ప్రాథమిక పాఠశాలల్లో అడ్మిషన్లు చేయిస్తున్నారు. తల్లిదండ్రుల సమక్షంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. తమ పిల్లలు ప్రీ స్కూల్ చదువులు ముగించుకుని ఒకటో తరగతిలో చేరుతున్న సందర్భంగా చాలా సంతోషంగా ఉందని తల్లిదండ్రులు తెలిపారు. అర్బన్ ఐసీడీఎస్ సీడీపీవో నీలిమ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మౌలా బీబీ, ఎంఎస్‌కే వరలక్ష్మి, ఏఎంఎం ప్రవంతి, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

త్వరలో వాట్సాప్ గవర్నెన్స్ సేవలు

మహారాణిపేట: ఆన్‌లైన్ సేవలను అభివృద్ధి చేశామని, త్వరలో వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రారంభించి వైద్యులు తమ సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయడమే కాకుండా, ఫీజు కూడా చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ వైద్య మండలి చైర్మన్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు అన్నారు. శనివారం ఆంధ్ర వైద్య కళాశాలలో ఆంధ్రప్రదేశ్ వైద్య మండలి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో రెన్యువల్, రీ-రిజిస్ట్రేషన్, ఎన్‌వోసీ, గుడ్ స్టాండింగ్ సేవలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలి సభ్యులు, రిజిస్ట్రార్ సిబ్బంది సహకారంతో రెండవ జిల్లా కేంద్ర కార్యక్రమాన్ని ఇక్కడ రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నామని తెలిపారు.

గురువుల ఆరాధనోత్సవాలు



లలితా పీఠంలో అన్నదానంలో పాల్గొన్న భక్తులు



అవ్యక్తానంద మహరాజ్‌కు అర్చన చేస్తున్న ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామి

సీతంపేట: అక్కయ్యపాలెంలోని శ్రీలలితాపీఠంలో గురువుల ఆరాధనోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. లలితాపీఠం ద్వితీయ పీఠాధిపతి అవ్యక్తానంద మహరాజ్ జయంతి సందర్భంగా మూడు రోజుల పాటు ఈ ఆరాధనోత్సవాలు జరగనున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా శనివారం పీఠం ఆవరణలోని అవ్యక్తానంద మహరాజ్ విగ్రహానికి విశేష అభిషేకం, అర్చనలు నిర్వహించారు. పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామి స్వయంగా పూజలు చేసి, అనంతరం భక్తులను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం పీఠంలో భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

ఆకట్టుకుంటున్న కుందేలు, జిరాఫీల బొమ్మలు



సత్యం జంక్షన్‌లో డివైడర్‌పై ఏర్పాటు చేసిన జిరాఫీ, కుందేలు బొమ్మలు



సీతంపేట: జాతీయ రహదారిపై సత్యం జంక్షన్‌లోని డివైడర్‌పై ఏర్పాటు చేసిన జిరాఫీలు, కుందేలు బొమ్మలు ఆకట్టుకుంటున్నాయి. బ్యూటిఫికేషన్‌లో భాగంగా డివైడర్‌పై ఒకవైపు మూడు జిరాఫీ బొమ్మలు, మరోవైపు రంగురంగుల కుందేలు బొమ్మను జీవీఎంసీ ఏర్పాటు చేసింది. హైవేలో అవి ఆకర్షణీయంగా ఉండటంతో ప్రయాణికులు వాటిని చూసుకుంటూ వెళ్తున్నారు.

విస్తృతంగా 'యోగాంధ్ర' క్యాంపెయిన్



యోగాసనాలు వేస్తున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు, యోగా టీచర్లు, విద్యార్థులు

మహారాణిపేట: ఈ నెల 21న విశాఖ వేదికగా.. 'విశ్వమంతా యోగాతో ఆరోగ్యం' అనే నినాదంతో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అత్యంత భారీగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. యోగాంధ్ర-2025పై విస్తృత ప్రచారం కల్పించడం, భారీ సంఖ్యలో ప్రజలను భాగస్వాములు చేసేందుకు నెల రోజుల కార్యాచరణను జిల్లా యంత్రాంగం రూపొందించింది. ఇందులో భాగంగా శనివారం ఆర్.కె.బీచ్ వద్ద ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు యోగాంధ్ర క్యాంపెయిన్ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ యోగా వల్ల ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తామన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ అపెక్స్ సభ్యురాలు యార్లగడ్డ గీతా శ్రీకాంత్ మాట్లాడుతూ యోగా దినోత్సవం రోజున 5 లక్షల మందితో విశాఖ బీచ్ రోడ్డు వేదికగా జరగనున్న యోగా కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ప్రజలందరూ పాల్గొని గిన్నీస్ రికార్డు సాధించాలని పిలుపునిచ్చారు. రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ అపెక్స్ మెంబర్ పోలా భాస్కర్ మాట్లాడుతూ నిరంతర యోగా సాధన ప్రతి వార్డు స్థాయిలో జరిగేలా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. శ్రీ శ్రీ యోగా స్టేట్ కో ఆర్డినేటర్ రాణి ఆధ్వర్యంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు, స్పోర్ట్స్ స్టూడెంట్లు, యోగా టీచర్లు సూర్య నమస్కారాలు, యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ఆయుష్ ఆర్‌డీడీ ఝాన్సీ, డీఎస్‌డీవో జూన్, నోడల్ ఆఫీసర్ శైలజ, యోగా ఆచార్య రవికిశోర్, శంకరనారాయణ, శారదవల్లి తదితరులు పాల్గొన్నారు.

బస్ స్టేషన్లలో 'యోగాంధ్ర' రిజిస్ట్రేషన్ క్యూఆర్ కోడ్



మద్దిలపాలెం బస్ స్టేషన్‌లో క్యూఆర్ కోడ్ బార్‌ను ప్రారంభిస్తున్న అప్పలనాయుడు

మద్దిలపాలెం: ఈ నెల 21న ఆర్కే బీచ్ రోడ్డు నుంచి భీమిలి వరకు జరిగే యోగాంధ్ర మెగా ఈవెంట్‌ను తిలకించడానికి వచ్చే వారి పేర్ల నమోదుకు మద్దిలపాలెం బస్ స్టేషన్‌లో క్యూఆర్ కోడ్ బార్ ఏర్పాటు చేశారు. దీనిని శనివారం జిల్లా ప్రజా రవాణాధికారి అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు ప్రముఖులు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు క్యూఆర్ కోడ్లు ప్రభుత్వం రూపొందించి అందజేసినట్లు తెలిపారు. వీటిని బస్ స్టేషన్లలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రయాణికులకు, సిబ్బందికి రిజిస్ట్రేషన్ ఎలా చేయాలో వివరించారు. మొబైల్‌లో స్కాన్ చేసి రిజిస్ట్రేషన్ కావచ్చన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఏపీఎస్ ఆర్టీసీ బస్సులను వివిధ జిల్లాల నుంచి రప్పించి తగు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. క్యూఆర్ కోడ్ గురించి ప్రయాణికులందరికీ డిపో మేనేజర్, మద్దిలపాలెం స్టేషన్ యూనిట్ ఇన్‌చార్జి, సూపర్‌వైజర్లు వివరిస్తారన్నారు.